
**వారం వారం కథాప్రభ**



# విలువలు

సడ్డపల్లె చిదంబరరెడ్డి

**పసుప్పచ్చ బోర్డుమీద 'హిందూపురం' అనే నల్లని అక్షరాలను చూసిన నాకు, ఎన్నో ఏళ్లపాటు దూరంగా ఉండి అప్పుడే ఎదురైన కన్నతల్లిని చూసినంతటి ఆనందం, ఉద్వేగం పొంగుకువచ్చాయి.**

స్టేషనులో రైలు ఆగీ ఆగకుండానే డోర్ తీసి చిన్నపిల్లాడిలా ప్లాట్‌ఫారంపైకి దూకి చుట్టూ కలయ జూచాను. ఇరవై ఏళ్లనాటికీ, ఇప్పటికీ స్టేషనులో పెద్దమార్పేమీ లేదుగానీ, మీటర్ గేజ్ తీసి బ్రాడ్ గేజ్‌గా మార్చరు.

ప్రయాణీకుల హడావుడి, పరుగులు, కేకలనైతే ఇన్నాళ్లూ అసహ్యించుకునేవాడిని కానీ, ఈ రోజెం దుకో అవన్నీ బాలమురళీగారి గానంలా కర్ణపే యంగా వినిపిస్తున్నాయి.

అందర్నీ తోసుకుంటూ తమ్ముడు రవికోసం చూశాను. ఎక్కడా కనిపించలేదు. నన్ను తీసు కుపోవడానికి వాడు రాకపోవడమన్నది కలలోని మాట! మేము కలుసుకుని చాలా ఏళ్ల అయింది కాబట్టి ఈ రద్దీలో గుర్తించడానికి కాస్త సమయం పట్టవచ్చు. లేదా ఏదైనా అత్యవసరమైన పని ఉండి, ఆలస్యంగా అయినా రావచ్చు. కె.కె. ఎక్స్‌ప్రెస్‌లో వస్తున్నట్లు ఒకటికి రెండుసార్లు జాబు రాశాను, టెలిగ్రాం కూడా ఇచ్చాను. అప్పుడో, ఇప్పుడో తప్ప కుండా వస్తాడు అని అనుకుంటూ సూట్‌కేసును దగ్గరగా లాక్కొని బెంచీమీద కూర్చున్నాను.

తమ్ముని కోసం గేటువైపు చూస్తున్న నా కళ్ల ముందు మానవాకారాలు అటూ ఇటూ కదులు తున్నా మనసులో మాత్రం గత స్మృతులు బొమ్మ కట్టాయి ...

* * *


అమ్మ, నాన్న, తమ్ముడు, నేను - మా నలు గురి జీవనానికీ ఐదెకరాల పొలం తక్కువేమీ కాదు కానీ, ఏ ఏడూ కూడా సకాలంలో చినుకులు రాల్చ ని ఋతుపవనాలు రైతుల జీవితాలతో చెలగాట మాడేవి. దుబారా ఏమీ చేయకుండా, కూలీలను పెట్టకుండా మా సేద్యం పనులు మేమే చేసు కునేవాళ్లం.

నన్నూ, తమ్ముణ్నీ చదివించి కడగండ్లపాలు చేసే వ్యవసాయం నుండి విముక్తిపొందాలని నాన్న తలచేవాడు కానీ, ఆరో తరగతికే చదువు తలకెక్క దని తమ్ముడు మొండికేసి, సేద్యగాడుగా మారి పోయాడు.

కాలేజీకీ, మా ఊరికీ దగ్గరే కావడంతో అటు సేద్యం చేస్తూ, ఇటు చదువుకుంటూ డిగ్రీ ముగించడమూ, ఢిల్లీలోని ఒక సంస్థలో ఉద్యోగం రావడమూ టకటకా జరిగిపోయాయి.

పల్లెటూళ్లో పుట్టి పెరిగిన నాకు ఢిల్లీ అంటే

అదేదో కొత్త దేశమో, కొత్త ప్రపంచమో అన్నట్లు తోచింది. చదువూ, వ్యవసాయం తప్ప మరో వ్యాసంగం తెలియని నేను నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పళ్లతోటలు, డైరీ, కోళ్ల ఫారాలు వగైరాలు బాగా వృద్ధి చేశాను. తరిగిపోయిన నష్టాలను చూసిన యజమాని రాంలాల్ గారు నాకో ఐదువేలు 'ఈనాం' ఇస్తూ, ఊరికెళ్లి అమ్మా, నాన్నలను చూసి రమ్మన్నాడు.



టిక్కెట్టు రిజర్వు చేద్దామని అనుకుంటూండగానే అర్జెంటుగా రమ్మని ఊరి నుండి టెలిగ్రా వచ్చింది.

అందిన రైళ్లు పట్టుకుని ఆదరా బాదరాగా హిందూపురం చేరుకున్నాను. నాన్న ఆరోగ్యం సరిగా లేదు. తమ్మునికి పెళ్లి నిశ్చయమైంది. నాకు పెళ్లి చేసెయ్యాలన్న నాన్న తలంపు విని ఏమి చేయాలో పాలుపోలేదు. ఎందుకంటే నాకు పెళ్లిప్రాయం వచ్చినా, ఆ ఆలోచనకానీ, దానిపై ఒక నిర్ణయాన్నిగానీ ఇంతవరకూ తీసుకోలేదు.

ఇపుడాలోచించడానికి వ్యవధి లేదు. "సరే" అని ఒప్పుకున్నాను - అది కూడా వరకట్నం ప్రసక్తి లేకుండా. వరకట్నం నిరాకరించడంతో నాకు పిల్ల దొరకడం గగనమైపోయింది. బంధుమిత్రులంతా నన్నో వింత జంతువును చూసినట్లు చూశారు. 'కాళ్ల దగ్గరకు వచ్చి పడే కట్నం వద్దనే వెర్రి వెంగళప్ప వీడు ఎలా బతికి బట్టకడతాడ్రా' అన్నట్లు చూసి విస్తుపోయారు, నవ్వుకున్నారు. చివరికి ఎవరి కాళ్లో పట్టి నాకూ పెళ్లి చేశామనిపించుకున్నారు.,

పక్షవాతంతో మంచంపట్టిన నాన్న కళ్లల్లోనే ప్రాణాలు దాచుకుని, దానికోసమే బతికినట్లు కళ్లారా పెళ్లి చూసి కళ్లు మూశారు.

అంతంతమాత్రం ఆరోగ్యంతోనే అవస్థపడే అమ్మ- నాన్న పది రోజులైనా తిరక్కుండానే పరమపదించింది.

ప్రతిజీవికీ మరణం తథ్యమని తెలిసినా అయినవారి అంతర్థానాన్ని మరువలేక అంగలార్చి, అంగలార్చి నిర్వేదం, నిరాశతో నా మనస్సంతా మసకబారిపోయింది. ఏమిటీ పాడు జీవితం? ఎంత ఆర్జించినా చాలదని చింతలుపోయే వింత జీవితం?! ఏ మట్టిపనో చేసినా పొట్టగడిచి పోతుంది. ఈ మాత్రానికే ఢిల్లీకే పోవాల్సిన అవసరం లేదనిపించింది.

రెండురోజుల్లో ఆ భావం ఎలా మారిపోయిందో కానీ, బయటి ప్రాంతంలో గుర్తింపు పొందడంలోనే ఏదో గొప్పతనమున్నట్లు తోచి, అంతో ఇంతో మిగిల్చుకున్న డబ్బును తమ్ముడికిచ్చి జాగ్రత్తలు చెప్పి ఢిల్లీకి ప్రయాణం కట్టాను.,

* * *

రాంలాల్‌గారు మొత్తం కార్యకలాపాలన్నీ నాకే అప్పగించి ఎస్టేట్ ఉత్పత్తులు ఎగుమతి చేయాలనే ఉద్దేశ్యంతో మార్కెట్ స్థితిగతులు గమనించడం కోసం అమెరికా వెళ్లాడు.,

"ఇక్కడ గిరాకీ బాగా ఉంది. ఆరేడు ఏజెన్సీలు మన ప్రాడక్టు పంపిణీ చేయడానికి ముందుకు వచ్చాయి. ఇదంతా నీ కృషిఫలితం. త్వరలో ఒప్పందం కుదుర్చుకుని తిరిగి వస్తున్నా!" అని టెలెక్స్ మెసేజ్ పంపాడు.


నా ఆనందానికి అవధులంటూ లేక ఏవేవో ఊహలతో ఆ రాత్రి కంటికి కునుకు లేదనంటే నమ్మండి.

విషయం తెలిసిన రాంలాల్‌గారి బంధు బలగం చాలా సంబరపడ్డారు. వేడుకలు జరుపుకున్నారు కానీ, అందరి ఆనందాలనూ ఆహూతి చేస్తూ పిడుగులాంటి వార్త - ఉగ్రవాదులు పెట్టిన బాంబు పేలి రాంలాల్‌గారు ప్రయాణిస్తున్న విమానం కూలిపోయిందని!

ఎవర్ని బలితీసుకుని ఏమి సాధించాలన్న పాశవికవాదమో కానీ, ఏ వాదాన్నీ ఇష్టపడని మానవతావాది, పదిమందికీ ఆశ్రయమిచ్చే పసిపాలాంటి రాంలాల్ గారు అపమృత్యువుపాలయ్యారు.

అనేకవందల ప్రాణాలు ఆకాశంలోనే అనంత వాయువుల్లో కలిసిపోవడంతో ఏ జాతివారు, ఏ దేశంలో ఎంత నిశ్చింతగా బతకగలిగారో కానీ, రాంలాల్ గారి ఎస్టేట్‌లో మాత్రం స్వార్థం తాలూకు జాతివారు మెల్లగా ఆక్టోపస్ పురుగులా అల్లుకుపోయారు.

పాల ఉత్పత్తులు, మాంసాహారాల్లో రుచుల



## బరువు తగ్గటానికి బలమైన మార్గాలు

**లా**వుగా ఉన్నవాళ్లని చూస్తే సాధారణంగా అందరూ అనే మాట ఒకటి ఉంది - "ఏమిటీ రోజు రోజుకీ పెరిగిపోతున్నావు?" అని. అలా అని ఊరుకోరు. కొంతమంది వేళాకోళం చేస్తారు. అభిమానం, ఆప్యాయత ఉన్న వాళ్లు కూడా చెప్పే సలహాలు నిష్ఠూరంగానే వినిపిస్తాయి. అధిక బరువున్న శరీరంకన్నా, లావుగా ఉన్నారన్న వ్యాఖ్యానాలే బాధగా ఉంటాయి.

దీనికి పరిష్కారమార్గాలలో మొట్టమొదటిది - ఎదుటివారి వ్యాఖ్యల్ని సజావుగా అర్థం చేసుకోవటం.

అధిక బరువు అందవిహీనతే కాదు, అనేక రకాల శారీరక, మానసిక బాధల్ని కలిగిస్తుంది.

శరీరం బరువు తగ్గించుకోవటం అంత కష్టమేం కాదు. కానీ బరువు తగ్గాలని ఎవరికి వారు గట్టి నిర్ణయం తీసుకుని తదనుగుణ కార్యాచరణకి పూనుకోవటమే కష్టమైన పని. ఒక్కసారి ఈ అడ్డు దాటితే బరువు అతి తేలిగ్గా తగ్గిపోతుంది.

వ్యాయామం, ఆహారపు అలవాట్లు, నిద్రపోయే సమయం - ఇలాంటి జాగ్రత్తలు చాలామంది చెప్తారు. చాలామందికి వాటి గురించి తెలుసు కూడా.

ఎక్కువమందికి తెలియని కొన్ని తక్కువ విషయాలు తెలుసుకుందాం.

వారానికి రెండువందల యాభై గ్రాములకన్నా బరువుతగ్గటం మంచిది కాదు. త్వరితంగా తక్కువ కాలంలో ఎక్కువ బరువు తగ్గటం కన్నా, నెమ్మదిగా బరువు తగ్గటం చాలా మంచిది. తక్కువసేపు చేసినా, వారానికి రెండుమూడుసార్లు కన్నా కనీసం అయిదు రోజులు వ్యాయామం చెయ్యటం మంచిది.

ఉపవాసాలు, పూర్తి నిరాహారం ఎంత మాత్రం మంచిది కాదు. రోజూ ఏం తిన్నా, దాని పట్టిక తయారుచేసుకుని వాటి కేలరీ విలువ లెక్కించుకోవటం అవసరం. రోజుకి వెయ్యి కేలరీలు దాటని ఆహారం తీసుకోవాలి.

బరువు తగ్గాలనుకోవటంకన్నా, ఇన్ని రోజులలో ఇంత బరువు తగ్గాలన్న పథకం మంచిది. అదీ మీలో మీరు చేసుకునే రహస్య నిర్ణయంలా కాకుండా, మీ దగ్గరవారికి చెప్పి చెయ్యటం మంచిది. ఎందుకంటే మీరు చేసే పొరపాట్లు ఏమైనా ఉంటే, వారు సరిదిద్దే అవకాశం ఉంటుంది.

లావుగా ఉండటం, అధిక బరువు ఉండటం కేవలం మీ పొరపాటే కానక్కర్లేదు. వంశపారంపర్యం కావచ్చు, లేదా ఇంకో కారణం కావచ్చు. అందువల్ల సిగ్గుపడకూడదు. నవ్వుతూ, ధైర్యంగా బరువు తగ్గండి!

- సౌమ్య

కోసం, ఆకర్షణల కోసం పలు రసాయనాలు, రంగులు కలపసాగారు. ప్రతిఘటించిన నా నోరు నొక్కారు.

'రాంలాల్ అండ్ కో వారి కల్తీ ఉత్పత్తుల మూలంగా ఊపిరితిత్తులు, గర్భకోశ వ్యాధులు వస్తున్నాయి, చర్మవ్యాధులు ప్రబలుతున్నాయి!' అని స్వచ్ఛందసంస్థలు ఆందోళనకు పూనుకున్నాయి. పత్రికలు వ్యాసాలు ప్రచురించసాగాయి. అధికారులు, అధినాయకులు అడ్డుచక్రం వేసి వాటన్నిటినీ అబద్ధాలుగా మార్చి అణగదొక్కేశారు.

ఏ కాన్ఫరెన్సుకు వెళ్లినా, ఏ డైరెక్టరుతో కలిసినా డబ్బు .... డబ్బు ... డబ్బు! ఎలా చేస్తామో, ఎవర్ని ముంచుతామో, ఎందర్ని చంపుతామో అవసరం లేదు కానీ, ఎటు తిరిగీ డబ్బు సంపాదించాలి, లాభాలు పెంచాలి!

విలువల వలువలూడ్చి, మానవతా విలువలను ఖననం చేసే కర్కోటకుల్లో నేనూ ఒకడిని కావడం నాకు అలవిగానిపనిగానూ, అవకాశవాదులు బిగించే ఉచ్చునుండి తప్పించుకోవడం నిత్యకృత్యంగానూ మారిపోయింది.

ఏ మనిషీ జీవించే మానవుడుగా కనిపించడంలేదు. ప్రతివాడూ తనలో తానే ప్రకంపించిపోయే మానవ మారణయంత్రంలా, ఆర్జనలకోసం వెంపర్లాడుతూ ఆసులో కండెలా తయారై అగమ్యగోచరంగా పాల్గొంటున్న పరుగు పందెంలో ఈర్ష్యలు, కక్షలు, ముఠా తగాదాలు, దోపిడీలు, మారణకాండలు, కార్ఖానాల కాలుష్యాలు, కర్ణాలను డొల్లచేసే వాహనాల ధ్వనులు ... ఈ నగర జీవనమంటేనే నాలో అసహనం, అసహ్యం బయలుదేరాయి.

మరోపక్క శ్రీమతి ఆరోగ్యం చెడిపోయింది. ఆస్పత్రులకు తిరగని రోజంటూ లేదు.

అట్టహాసాల బోర్డులే తప్ప ఆర్తిగా రోగిని పలకరించి రోగకారణం వివరించే వైద్యుడే తారసపడటంలేదు. రోగి చెప్పింది యాంత్రికంగా వినడం, చాటెడు మాత్రలు రాసివ్వడం, చేతనైనంత గుంజుకోవడమే వారి వృత్తి. ఉన్న డబ్బంతా వెన్నపూసలా కరిగిపోయినా ఆమె రోగం నిర్ధారణ కాలేదు. పిల్లల చదువుల డొనేషన్లొకపక్క!

ఏమి స్వారస్యముందని మహానగరాల జీవితం మహోన్నతమైందని అందరూ ఎగబడుతున్నారో అర్థం కాలేదు.

కాకతాళీయంగా మా ఇంటికొచ్చిన వైద్య మిత్రుడు శ్రీమతి రోగలక్షణాలను, వాడిన మందులను కూలంకషంగా విచారించి - కుండ బద్దలుకొట్టినట్లు చెప్పేశాడు -

అన్ని శరీరాలకూ, అన్ని ఆ ఆహారాలూ సరిపోవు. ఈమెకు ఇక్కడి కాలుష్యపు గాలి, ఆహారం ... చివరికి కట్టే గుడ్డలు, స్నానానికి వాడే సబ్బు కూడా పడటంలేదు. అందుకే శ్వాసకోశాలన్నీ కుంచించుకుపోతున్నాయి. శరీరానికి తగిన ప్రాణవాయువందక ఇన్ని ఇబ్బందులొస్తున్నాయి. దీనికి మందు లేదు. ఎందుకంటే ఇది రోగం కాదు, అలర్జీ!

"ఈ అలర్జీ పోవాలంటే నగరానికి దూరంగా పచ్చని ప్రకృతి మధ్యకు చేరాలి. క్రిమిసంహారకాలు, కృత్రిమ ఎరువులకు బలికాని ఆహారం, ఆకు కూరలు భుజిస్తే చాలు, ఆ అలర్జీ పటాపంచలైపోతుంది" అని.

అతను చెప్పింది అక్షరసత్యమనిపించింది. అహోరాత్రులూ కృషిచేసి అసహజ జీవనాలను కల్పించుకుంటున్న పట్నవాసం నుండి బటయపడి, ప్రశాంతమైన పల్లెవాసానికి తిరిగిపోదామనిపించింది.

ఎట్లాగూ పిల్లల హైస్కూలు చదువులు ముగిశాయి. పొలంలో పూరిపాక వేసుకుని నాలుగు పశువులు మేపుకున్నా జీవనం సాగించవచ్చని

నిర్ణయించుకుని - అదే విషయాన్ని తమ్మునికి జాబు రాశాను. మొదట్లో అయితే తరచుగా క్షేమ సమాచారాలు తెలుసుకునేవాళ్లం. ఈమధ్య చాన్నాళ్లుగా మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు లేవు.

"సాబ్, ఆటో హోనా?" అన్న పిలుపుతో ఆలోచనలు చెదిరిపోయాయి.

రైలు వెళ్లిపోవడంతో స్టేషనంతా పలచబడింది. అయినా తమ్ముడు రాలేదు. గత్యంతరం లేక ఆటో ఎక్కి ఊరు చేరుకున్నాను.

పాతకాలపు మట్టిమిద్దెల స్థానే చాలావరకు కొత్త భవనాలు వెలిశాయి. నేను పెరిగినప్పటి గ్రామ వాతావరణం అణుమాత్రం కూడా అగుపించలేదు. ఒక కొత్తకాంక్రీటు మేడను తమ్ముని ఇల్లుగా ఎవరో చెబితే అందులోకి అడుగు పెట్టాను.

తమ్ముడు హాల్లో కూర్చుని పేపరు చదువుతున్నాడు. మరదలు కాబోలు, నన్ను చూసీ చూడ్డంతోనే గదిలోకి వెళ్లిపోయింది.

ఒకే రక్తం పంచుకుని పుట్టినవాడు ఇరవై ఏళ్ల తర్వాత కలుసుకుంటే వ్యక్తమయ్యే అభిమానం, ఆప్యాయత వంటి ఎలాంటి వాతావరణమూ లేదు. అందరూ బిగుసుకు కూర్చున్నారు.

కనీసం మర్యాపూర్వకంగా పలకరించే మాటలకు కూడా నోచుకోకపోవడంతో, హాల్లో ఫాను తిరుగుతున్నా కూడా నా ఒళ్లంతా చెమట్లు పోశాయి. ఎక్కడికో వెళ్లబోయి, మరెక్కడికో చేరుకున్నట్లు కొన్ని నిముషాలు ముళ్లమీదలా ఉండిపోయాను.

బయటి నుండి లోపలకి వస్తూ పెద్దమ్మాయి రేణుక కాబోలు - "పెద్దమ్మా, అన్నయ్యగారూ రాలేదా, పెదనాన్నా?" అని అడిగి, ఎవరో తరుముతున్నట్లు అక్కడినుండి వెళ్లిపోయింది.

"అనంతపురంలో వాళ్ల మామయ్య పిల్చుకుపోయాడమ్మా!" అని నిరాసక్తంగా బదులిచ్చి అక్కడే ఉన్న కుర్చీ లాగి కూర్చున్నాను.

ఊహించని సన్నివేశం ఎదురు కావడంతో మాటలందక మనసు మొద్దుబారిపోయింది. గోడకు వేలాడుతున్న గడియారంలా సెకండ్ల ముల్లు నిర్విరామంగా శబ్దం చేస్తూ ఉంది.

దాని చక్రాల అంతర్గత సంఘర్షణల పరంపరలో బిగించిన నరాల తీగ లాగుడుతో లోలకం గుండెబాదుడు కొందరికి కాలమానంగా తోచవచ్చునేమో కానీ, నాకు మాత్రం భరింపరాని గుండెకోత లాగుంది. అంత పెద్దహాలు నన్ను బంధించిన పంజరంలాగా తోచింది. ప్రతి నిముషం ఒక యుగంలాగా పదినిముషాలు గడిచాయి.

అప్పటికి నా ఉనికిని గుర్తించాడు కాబోలు తమ్ముడుగారు, చదువుతున్న పేపరు నుండి తల పైకెత్తి - "ఇప్పుడేనా వచ్చింది?" అని గత్యంతరం లేనట్లు పలకరించి, మరల పేపరు వెనుక దాక్కున్నాడు. ఆ ధ్వని పరామర్శలా లేదు. 'బాబూ ఆకలి' అని ప్రాధేయపడినవాడిని భరించలేక, 'ఛీఛ! ముందుకెళ్లు!' అని కసురుకొన్నట్లు ఉంది.

వాడి నల్లని ముఖం, కనుగుడ్లలోని ఎర్రని జీర, పురితీసిన మీసాలు చూస్తూనే - వీడు పుట్టుకతో తమ్ముడేమో కానీ, నా తమ్ముడుగా మాత్రం ఎదగలేదని తేలిపోయింది. అయినా గత్యంతరం లేదు.

"ఉద్యోగానికి రాజీనామా చేశాను. ఇక్కడికే వస్తున్నట్లు జాబు రాశాను కదా!" అన్నాను సావధానంగా.

"దానిదేముంది? ఈ ఊరు నా సొంతమేమీ కాదు. ఎక్కడికయినా వచ్చి మహరాజులా ఉండొచ్చు" అన్నాడు తేలిగ్గా.

"ఎక్కడికో ఎందుకు? మన ఆస్తి, ఇల్లు ఉంది కదా!" అన్నాను అసహనాన్ని బిగపట్టుకుని.

"ఇంకా ఇక్కడ 'మన' ఆస్తి ఎక్కడిది? దాన్నంతా అమ్మేస్తే కానీ నాన్న చేసిన అప్పులే తీరలేదు. ఇప్పుడున్న ఇల్లు, ఆస్తులు చూసి ఆశలు పెంచుకున్నావేమో ... వాటిపై సూది మోపిన హక్కు కూడా నీకు లేదు. నేను, నా భార్య, పిల్లలు కూలిపనులు చేసి సంపాదించుకున్న స్వార్జితాలు!" అంటే కంఠస్థం చేసిన పాఠంలా అప్పజెప్పాడు.

పొలం దున్నేటప్పుడు కొండ్ర నేరుగా పట్టక, వరిమడిలో గట్లు సరిగా పూయక, నా చేతిలో గొడ్డులా దెబ్బలుతిన్న తమ్ముడు వీడేనా? పది రూపాయలు తీసుకుపోయి బజార్లో సరుకులు తేలేక బిక్కమొహంతో ఇంటికి తిరిగి వచ్చిన తమ్ముడేనా వీడు? ఔరా! ఎంత పథకం ప్రకారం రక్త సంబంధం కుత్తుక కత్తిరిస్తున్నాడు! కంచే చేను మేయడమన్నదానికి ఇంతకు మించి దృష్టాంతరమక్కరలేదు.

ఆత్మరక్షణకోసం అనుమతి పొందిన పిస్తోలు సూట్‌కేసులోనే ఉంది. తలుచుకుంటే - స్వార్థంలో కైపెక్కిన రాస్కెల్‌ను తూట్లు తూట్లుపడేలా కాల్చి పారేయడానికి క్షణకాలం పట్టదు. అయినా సుఖశాంతుల విలువలు తెలియని ఈ పాడు మనుషుల హింసాసంస్కృతి నాకక్కరలేదు. మాట్లాడటానికి ఏమీ మిగల్లేదు. లేచి నిలబడ్డాను. అనిర్వచనీయమైన నిర్వేదం మనసునంతా ఆక్రమించేసింది. దాహంతో నాలుక పిడుచకట్టుకుపోయింది.

అప్పుడు అమ్మాయి తెచ్చిన కాఫీ ముట్టుకోవడానికి కూడా బుద్ధి పుట్టలేదు. నిట్టూర్పులు గొంతునుండి ఎగదన్నుకువచ్చాయి. సూట్‌కేసు అందుకుని వీధికేసి నడక సాగించాను.

నిర్లిప్తంగా అడుగులు వేస్తున్న నన్ను పీడిస్తున్నది ఎక్కడికెళ్లాలి? ఎలా బతకాలి అనే ప్రశ్న ఏ మాత్రం కాదు. బస్‌స్టాండులో బజ్జీలో, పంది మాంసమో అమ్మి బతకవచ్చు.

పట్నాలు మాత్రమే అనుకుంటే ఈ పల్లెల్లో కూడా మనిషి మనిషి అంతరంగంలో ఆర్థిక ప్రాధాన్యాలు పెరిగి ఆర్ద్రతలు తరిగిపోతుంటే, ఆధుని కత అంటూ, ఇరవై ఒకటే శతాబ్దానికి వచ్చేశామంటూ అందరూ చంకలు గుద్దుకోవడంలో ఉన్న ఆంతర్యమేమిటో నాకైతే అర్థం కాలేదు. తెలిస్తే మీరైనా చెప్పండి, ప్లీజ్! Ⓟ

